మంచిగా ఆలోచించు
మంచిగా మాట్లాడు
మంచి పని చెయ్యి
ఎందుకంటే
నువ్వు ఏమి చేస్తావో
అదే తిరిగి నీదగ్గరికి
మంచిగా వస్తుంది


# DD9 వార్త

తెలుగు దినపత్రిక



## నాకు నయనతార కావాలి..
## నా కల నెరవేరుస్తారా..?






సంపుటి : 01 సంచిక : 207 హైదరాబాద్, మార్చి, బుధవారం 18, 2026 పేజీలు : 05 వెల : 3.00



# ఉద్యోగ కల్పన ఏమైంది?



**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది 11 వేల ఉద్యోగాలే**
**67 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు తప్పడు ప్రచారం**
**మొదటి ఏడాదిలోనే 2 లక్షల కొలువులు ఎందుకివ్వలేదు**
**రాష్ట్రంలో సంపూర్ణ రుణమాఫీ చేయలేదు**
**చేసినట్టు నిరూపిస్తే నేను రాజీనామాకు సిద్ధం**
**కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది**
**రేవంత్ రెడ్డి హార్వర్డ్ వెళ్లి చదువుకున్నాడు సరే..**
**పేద విద్యార్థుల రీయింబర్స్ మెంట్ ఎందుకు ఇస్తలేరు**
**అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం 67 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ నిజంగా ఇచ్చినవి కేవలం 11 వేల ఉద్యోగాలేనని ఆయన ఆరోపించారు. శాసన సభ వేదికగా మాట్లాడిన కేటీఆర్, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అనేక ప్రశ్నలు లేవనెత్తారు. అధికారంలోకి ..మిగతా 2లో

# కాంగ్రెస్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



**సంక్షేమ పథకాలపై లెక్కలతో సహా వివరిస్తాం**
**53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్**
**1.06 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం**
**దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం**
**బీఆర్ఎస్ డబుల్ బెడ్రూం అంటూ మోసం..**
**మేం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం**
**రైతు భరోసా కింద ఎకరాకు రూ. 6వేలు అందజేస్తున్నాం**
**రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలనలో అప్పులు పాలు చేశారు**
**అయినా మేం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం**
**ఇంత చేస్తున్నా ఆరోపణలు చేయడం సరికాదు**
**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు అసత్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతోందో గణాంకాలతో సహా ..మిగతా 2లో

# హ్యామ్ రోడ్ల పేరిట భారీ కుంభకోణం..

హ్యామ్ రోడ్ల పేరిట
భారీ కుంభకోణం జరుగుతోంది
హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు
మాజీ మంత్రి హరీష్ రావు
మరోసారి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ (HAM) రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతూ... ..మిగతా 2లో



# డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. మరి కేటీఆర్ సిద్ధమా?

**మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**
**రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన**
**ప్రజాప్రతినిధులందరూ**
**డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి**
**డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం, మరి కేటీఆర్**




**హైదరాబాద్, (డిడి9 వార్త):** శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన ..మిగతా 3లో

# నేను పార్టీ వీడతానని సంజయ్‌కు చెప్పానా?..

## మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టాడు!

**తనతో కలిసి పనిచేయాలని**
**జగిత్యాల ఎమ్మెల్యే ఆఫర్ ఇచ్చారు**
**సంజయ్ బీఆర్ఎస్‌లో**
**ఉన్నారని స్పీకర్ అంటున్నారు**
**నాకు ఆఫర్**
**ఇవ్వడానికి సంజయ్ ఎవరు?**
**నేను పార్టీ**
**వీడతానని ఆయనకు చెప్పానా?**




# మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సిట్

**దుబాయ్ లింకులపై ఫోకస్**
**ఫామ్ హౌస్**
**ఘటనపై కీలక మలుపు**
**చేవెళ్ల డీసీపీ నేతృత్వంలో**
**విచారణ ప్రారంభం**
**డ్రగ్స్ సరఫరా**
**మార్గాలపై లోతైన దర్యాప్తు**
**కాల్పుల ఘటనతో**
**బయటపడ్డ అసలు నిజాలు**
**పలువురికి డ్రగ్స్ టెస్టుల్లో పాజిటివ్**
**రాజకీయ వర్గాల్లో**
**కలకలం రేపిన సంఘటన**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** రంగారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డికు సంబంధించిన ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు ..మిగతా 2లో

# జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్ చేయాలి

మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే 100 సీట్లు
వైఎస్ఆర్ లాంటి మాస్ లీడర్ జగ్గారెడ్డి
టీపీసీసీ పదవిపై మళ్లీ ఊహాగానాలు
జగిత్యాలలో జీవన్ రెడ్డి అసంతృప్తి తీవ్రం
పార్టీ మార్పుపై
సంకేతాలు ఇస్తున్న సీనియర్ నేత
స్థానిక నాయకత్వంపై తీవ్ర విమర్శలు



## హ్యామ్ రోడ్ల పేరిట భారీ కుంభకోణం..

మొదటిపేజీ తరువాయి



'రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ (ఆర్ అండ్ బీ)లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు.
ఈ టెండర్లకు సీఓటీ (COT) అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్ చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే 100 సీట్లు
- పీజేఆర్ లాంటి మాస్ లీడర్ జగారెడ్డి
- టీపీసీసీ పదవిపై మళ్లీ ఊహాగానాలు
- జగిత్యాలలో జీవన్ రెడ్డి అసంతృప్తి తీవ్రం
- పార్టీ మార్పుపై సంకేతాలు ఇస్తున్న సీనియర్ నేత
- స్థానిక నాయకత్వంపై తీవ్ర విమర్శలు






హైదరాబాద్, (డిడి9 వార్త):
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అంతర్గత చర్చలు, వివాదాలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీశాయి. ఆయన చేసిన కామెంట్లు పార్టీ లోపలి పరిస్థితులపై స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీ అంటే స్వేచ్ఛా భావాలకు ప్రతీక అని చెప్పుకునే పరిస్థితి ఈ వ్యాఖ్యలతో మరోసారి బయటపడిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.
ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంగారెడ్డి నాయకుడు జగ్గారెడ్డి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగ్గారెడ్డి ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే మాస్ లీడర్ అని కొనియాడారు. అలాంటి నాయకుడిని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే పార్టీకి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఆయన మాటల్లో స్పష్టతతో పాటు ఒక రకమైన సూచన కూడా కనిపించిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని కోమటిరెడ్డి ధైర్యంగా చెప్పడం మరింత చర్చకు దారి తీసింది. ఈ వ్యాఖ్యలు ఎందుకు చేశారు? ప్రస్తుతం ఉన్న నాయకత్వంపై అసంతృప్తి ఉందా? లేక భవిష్యత్తు వ్యూహాల్లో భాగమా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.
జగ్గారెడ్డి రాజకీయ ప్రయాణం కూడా ఆసక్తికరంగానే ఉంది. అసలు పేరు తూర్పు జయప్రకాశ్ రెడ్డి అయిన ఆయన, రాజకీయాల్లో మొదట బీజేపీ నుంచి ప్రవేశించారు. తరువాత వివిధ పార్టీల్లో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంచి పేరు సంపాదించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఆయనకు మాస్ ఫాలోయింగ్ ఉందనే విషయం తెలిసిందే.2018లో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి, 2023 ఎన్నికల్లో మాత్రం ఓటమి చవిచూశారు. బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ ఆయన ప్రభావం తగ్గలేదనే అభిప్రాయం ఉంది. ఆయన భార్య నిర్మల జగ్గారెడ్డికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం కూడా అదే సూచిస్తుంది. ఇది కాంగ్రెస్ నాయకత్వం ఆయనపై నమ్మకం ఉంచిందనే సంకేతంగా భావిస్తున్నారు.
జగ్గారెడ్డి వ్యక్తిత్వం గురించి కూడా కోమటిరెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎవరైనా కష్టాల్లో ఉంటే వెంటనే స్పందించే నాయకుడు అని, ప్రజలకు దగ్గరగా ఉండే స్వభావం ఆయనకు ఉందని చెప్పారు. ఈ లక్షణాలే ఆయనను మాస్ లీడర్‌గా నిలబెట్టాయని అభిప్రాయపడ్డారు. మరో పీజేఆర్ స్థాయికి ఎదిగే నాయకుడు అని చెప్పడం గమనార్హం.
ఇదిలా ఉండగా, మరోవైపు జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. అక్కడ సీనియర్ నేత జీవన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీ మార్పుపై ఆలోచనలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతున్నాయి.
జీవన్ రెడ్డి తన అసంతృప్తికి కారణం ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ అని స్పష్టం చేశారు. తనకు ఎంత ఇబ్బంది కలిగితేనే పార్టీ మారాలని ఆలోచిస్తానో అర్థం చేసుకోవాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. కాంగ్రెస్‌తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అయితే ఇంకా తాను పార్టీని వీడలేదని కూడా స్పష్టం చేశారు.జగిత్యాలలో అభివృద్ధి పనులు సరిగా జరగడం లేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే సరిగ్గా వినియోగించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల అభివృద్ధి హక్కును సాధించడంలో విఫలమవుతున్నారని అన్నారు. ఒక నాయకుడు తప్పు మార్గంలో నడిస్తే ప్రజలు అంగీకరించరని హెచ్చరించారు.
ఇంకా ఒక ఆసక్తికర అంశం కూడా బయటకు వచ్చింది. జీవన్ రెడ్డి కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడంపై చర్చ జరుగుతోంది. దీనిపై స్పందించిన ఆయన, ఒకసారి పార్టీని వదిలేస్తే అన్నీ మారిపోతాయని వ్యాఖ్యానించారు. ఇది పార్టీ మార్పుకు సంకేతమా అనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి.ఇక స్థానిక రాజకీయాల విషయానికి వస్తే, సంజయ్ బీఆర్ఎస్ నుంచి గెలిచి తరువాత కాంగ్రెస్‌లో చేరడం కూడా వివాదానికి కారణమైంది. ఈ పరిణామాన్ని మొదటి నుంచే జీవన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నారు. గతంలో తనకు ఇబ్బందులు కలిగించిన వ్యక్తిని పార్టీలోకి తీసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.
మున్సిపల్ ఛైర్మన్ పదవి విషయంలో కూడా వివాదం నెలకొంది. తన వర్గానికి ఇవ్వాల్సిన పదవిని ఇవ్వకుండా అడ్డుకున్నారని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ అంశం కూడా ఆయన అసంతృప్తికి ప్రధాన కారణంగా మారింది. పార్టీలో తనను పట్టించుకోవడం లేదనే భావన ఆయనలో పెరిగిందని తెలుస్తోంది.మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో రెండు విభిన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు జగ్గారెడ్డి లాంటి నాయకులను ముందుకు తేవాలని కొందరు భావిస్తుంటే, మరోవైపు సీనియర్ నేతలు అసంతృప్తితో పార్టీ మార్పుపై ఆలోచిస్తున్న పరిస్థితి ఉంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో పార్టీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి.

# ఉద్యోగ కల్పన ఏమైంది?

మొదటిపేజీ తరువాయి

వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన కేటీఆర్, ఆ హామీ ఏ స్థాయిలో అమలైందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు సంఖ్యలతో మాయాజాలం చేస్తోందని విమర్శించారు.
జాబ్ క్యాలెండర్‌పై కూడా కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి, చివరకు అది కేవలం ఉత్తుత్తి క్యాలెండర్‌గా మిగిలిపోయిందన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొందని వ్యాఖ్యానించారు. రాజీవ్ యువ వికాసం కార్యక్రమం కూడా ఎలాంటి పురోగతి లేకుండా నిలిచిపోయిందని విమర్శించారు.
ఉద్యోగుల సమస్యలపై మాట్లాడిన కేటీఆర్, ప్రభుత్వం ఇచ్చిన పీఆర్సీ హామీ అమలు కాలేదని అన్నారు. ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని చెప్పి, ఇప్పటికీ అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన ప్రయోజనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఇప్పటికే 80 మంది మరణించారని పేర్కొన్నారు.
రైతు సమస్యలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఏ ఒక్క గ్రామంలో అయినా పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందని నిరూపించగలదా అని ప్రశ్నించారు. అలా జరిగిందని నిరూపిస్తే తాను వెంటనే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. పంట బోనస్ ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు ఎరువుల కోసం అడిగితే పోలీసులతో దాడులు చేయించారన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలను కూడా కేటీఆర్ తప్పుబట్టారు. Kaleshwaram Lift Irrigation Project ను "కూలేశ్వరం"గా అభివర్ణించడం సరైంది కాదన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. అయినప్పటికీ రాజకీయ కారణాలతో ఈ ప్రాజెక్టును అపప్రథకు గురిచేస్తున్నారని విమర్శించారు.
విద్యా రంగంపై కూడా కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని అన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.
ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సీఎం Harvard University లో చాలా నేర్చుకున్నారని చెప్పుకుంటున్నారని, కానీ ఆ పర్యటన ఖర్చును ప్రభుత్వం భరించిందని అన్నారు. ఆ ఖర్చుతో రాష్ట్రానికి ఏమి లాభం కలిగిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.
ప్రజా రవాణా అంశంపై మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే బస్సుల సంఖ్య పెంచకుండా, సరిపడా సీట్లు లేకుండా పథకం అమలు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏసీ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని సూచించారు.
హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. నగరంలో కొత్తగా ఒక్క ఇటుక కూడా వేయలేదని, ఉన్న నిర్మాణాలను కూల్చివేయడానికే పరిమితమైందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో చేపడుతున్న కార్యక్రమాల వెనుక భూముల వ్యవహారమే ప్రధానంగా ఉందని అన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం భూముల చుట్టూ తిరుగుతోందని ఆరోపించారు.
ముఖ్యంగా ధార్మిక సంస్థల భూముల విషయంలో కూడా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కేటీఆర్ తప్పుబట్టారు. Sarada Peetham కు కేటాయించిన భూముల విషయంలో కూడా జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. ఈ విధమైన చర్యలు ప్రభుత్వ నిబద్ధతపై అనుమానాలు కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించారు.



మొత్తంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగాలు, రైతు సంక్షేమం, విద్య, మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాల్లో స్పష్టమైన పురోగతి కనిపించడంలేదని అన్నారు. ప్రజల ఆశలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, కేవలం ప్రకటనలకే పరిమితమైందని ఆరోపించారు.
ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేటీఆర్ సూచించారు. లేదంటే ప్రజలు తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారని హెచ్చరించారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సిట్




మొదటిపేజీ తరువాయి

జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయంతో కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.ఈ సిట్‌కు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నాయకత్వం వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి అధికారిక ఆదేశాలు జారీ చేశారు. ఈ దర్యాప్తు బృందం ఘటనకు సంబంధించిన అన్ని కోణాలను సమగ్రంగా పరిశీలించనుంది. ముఖ్యంగా ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ, అక్కడికి హాజరైన వ్యక్తులు, డ్రగ్స్ వినియోగం వంటి అంశాలపై లోతైన విచారణ చేపట్టనున్నారు.
ముఖ్యంగా ఈ కేసులో అంతర్జాతీయ సంబంధాలపై కూడా దృష్టి పెట్టడం గమనార్హం. దుబాయ్‌తో సంబంధాలున్నాయా? డ్రగ్స్ సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది? ఇందులో ఎవరెవరు భాగస్వాములు? అనే అంశాలపై సిట్ ప్రత్యేకంగా దర్యాప్తు చేయనుంది. అలాగే ఈ వ్యవహారంలో ప్రస్తావనకు వచ్చిన నమిత్ శర్మ వ్యాపార లావాదేవీలు, ఆయన సంబంధాలు కూడా విచారణలో కీలకంగా మారనున్నాయి.ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడి సమయంలో అక్కడ జరుగుతున్న పార్టీపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు తనిఖీలు చేపట్టగా పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.
దాడి సమయంలో అక్కడ ఉన్న నమిత్ శర్మ కాల్పులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అక్కడ ఉన్న వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 11 మందిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.అనంతరం వారిపై డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా పలువురికి పాజిటివ్ వచ్చినట్లు వెల్లడైంది. ఈ విషయం కేసును మరింత సీరియస్‌గా మార్చింది. డ్రగ్స్ వినియోగం జరిగినట్లు స్పష్టమైన సంకేతాలు లభించడంతో దర్యాప్తు మరింత విస్తరించింది. ఇందులో పాల్గొన్న వారందరి పాత్రను పోలీసులు పరిశీలిస్తున్నారు.
ఈ కేసులో రాజకీయ కోణం కూడా బయటపడింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కూడా ఈ పార్టీలో పాల్గొన్నట్లు సమాచారం. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి కూడా పాజిటివ్ వచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో ఈ ఘటన రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో సంబంధిత పార్టీల నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి. పైలట్ రోహిత్ రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్ ఇద్దరికీ వారి వారి పార్టీలు నోటీసులు జారీ చేశాయి. ఈ ఘటనపై పూర్తి వివరణ ఇవ్వాలని కోరాయి. విచారణ పూర్తయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించాయి. ఇది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
ఇక ఈ కేసులో పాల్గొన్న ఇతరుల వివరాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు, వారి నేపథ్యం, వారి సంబంధాలు వంటి అంశాలపై సిట్ ప్రత్యేక దృష్టి సారించనుంది. ముఖ్యంగా డ్రగ్స్ సరఫరా గొలుసును ఛేదించడమే లక్ష్యంగా విచారణ కొనసాగనుంది.ప్రస్తుతం పోలీసులు సేకరించిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులు వంటి అంశాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో అంతర్జాతీయ మాఫియా సంబంధాలు ఉన్నాయా అన్న కోణంలో కూడా విచారణ సాగుతోంది. దుబాయ్ లింకులపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఈ కేసుకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ప్రభుత్వం ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి సిట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.మొత్తంగా చూస్తే, మొయినాబాద్ ఫామ్ హౌస్ ఘటన కేవలం ఒక పార్టీ వ్యవహారంగా కాకుండా, పెద్ద డ్రగ్స్ నెట్‌వర్క్‌కు సంబంధించినదిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ, వ్యాపార, అంతర్జాతీయ కోణాలు కలిసిన ఈ కేసు భవిష్యత్తులో మరిన్ని సంచలన విషయాలను బయటపెట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

మొదటిపేజీ తరువాయి

వెల్లడించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై జరిగిన ధన్యవాద తీర్మాన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.
ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా మధ్యతరగతి, పేద కుటుంబాలకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తున్నదని వివరించారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో కుటుంబ ఖర్చుల్లో ఉపశమనం కలిగిందని ఆయన పేర్కొన్నారు.
అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆహార భద్రత కల్పించడంలో ఇది కీలక కార్యక్రమమని పేర్కొంటూ, పేదల ఆకలి సమస్యను తగ్గించడంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోందని చెప్పారు. గతంలో లబ్ధిదారులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగిస్తూ, పారదర్శకంగా ధాన్య పంపిణీ జరుగుతోందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నాం. రైతు భరోసా ఇస్తున్నామని వివరించారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని కేవలం ఆరోపణలతో తగ్గించలేమని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పథకం వెనుక స్పష్టమైన లక్ష్యాలు, గణాంకాలు ఉన్నాయని, అవసరమైతే వాటిని సభ ముందుంచుతామని అన్నారు. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.
ఈ సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని చెప్పడం రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న ప్రయత్నమని అన్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో అపోహలు కలిగించేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజలకు స్పష్టత ఇవ్వడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.
ఇదే సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు నిర్మాణాత్మక సూచనలు ఇస్తారని ఆశించామని, అయితే అలాంటి చర్చ కనిపించలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సూచనలు ఇవ్వడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు.
కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయి పార్టీ అని శ్రీధర్‌బాబు తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లడం తమకు సహజమేనని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలవడం అవసరమైతే ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు సాధించడమే తమ లక్ష్యమని చెప్పారు.
ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు కూడా గతంలో ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లారని శ్రీధర్‌బాబు గుర్తు చేశారు. అప్పుడు అది తప్పు కాదని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు వెళ్లడం తప్పుగా చూపించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం అవసరమని, దానిలో ఎటువంటి రాజకీయాలు చూడకూడదని అన్నారు.
ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు కట్టుబడి ఉందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలు ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నామని తెలిపారు. ప్రతిపక్షం విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, అవి వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు.
శాసనసభలో జరిగిన ఈ చర్చలో ప్రభుత్వం తన పనితీరును గణాంకాలతో సమర్థించుకోవడంతో పాటు ప్రతిపక్ష ఆరోపణలకు సమాధానమిచ్చింది. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రజలకు అందుతున్న లబ్ధులపై స్పష్టమైన వివరాలు వెల్లడించడం ద్వారా అపోహలను నివారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని స్పష్టం చేసింది.
మొత్తంగా, శాసనసభ వేదికగా ప్రభుత్వం తన సంక్షేమ కార్యక్రమాల ప్రభావాన్ని వివరించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలను ఖండించింది. ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని, అందుకోసం తీసుకుంటున్న చర్యలను కొనసాగిస్తామని ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు.





# తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మెరిసిన గిరిజన ఆణిముత్యం కొట్నాక్ జాకేష్.

- **ఆదర్శ క్రీడా పాఠశాల జాతర్ల కు దక్కిన బంగారుపథకం.**

**బజార్హత్నూర్, మార్చి 17(డిడి9వార్త ):-**


తెలంగాణలోని హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామంలో గల స్థానిక గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి కోట్నాక్ జాకేష్ ప్రతిభ కనబరిచారు. 60మీటర్లపరుగుపందెంలోబంగారు పతకం సాధించాడు.ఈ నెల 28 వ నుంచి హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొంటాడని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు అడ్డి భోజా రెడ్డి, పి.రమేష్లు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం జాతర్ల క్రీడా పాఠశాలను సందర్శించిన జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి,ఏటిడిఓ సుచంత రెడ్డిలుసన్మానించి అభినందించారు.జాతీయ స్థాయిలోను రాణించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ రెడ్డి, బి.శేఖర్, మడావి కృష్ణారావు, కోచ్ సాహుల్, ఎస్సీ ఆర్ పి విట్టల్ రావు, రాందాస్,భీమ్రావ్, మోహన్ సింగ్, ఆర్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.





# చలో ఢిల్లీ మహాగర్జన

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 17(డి డి 9):-**




ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో ఆదివాసీ భవనంలో బోథ్ మండలంలోని ఆదివాసీ నాయకులు, మతం మారిన గిరిజనులను ST జాబితా నుండి తొలగించాలని .గిరిజన సురక్ష మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో మే 232425 తేదీలలో *చలో ఢిల్లీ డిలీషన్ మహాగర్జన కార్యక్రమన్ని విజవంతం చేయాలనీ పిలునిచ్చారు. ఆ తరువాత *చలో ఢిల్లీ మహాగర్జన కార్యక్రమం యొక్క పోస్టర్ లు కర పత్రాలు ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది ఈకార్యక్రమంలో పట్నాపూర్ రాయి సెంటర్ సర్మేడి ఆడేం భీంరావ్, బాబేర సర్మేడి మాడవి గంగారాం నాయకపోడ్ సంఘం నాయకులు రామేల్లి భోజన్న, కుర్మే రాజన్న ఆదివాసీ నాయకులు పంద్రం శంకర్, కనక అమృత్ రావు, తొడసం గోపాల్, మండడి మోహన్ ,కరత్వాడ సర్పంచ్ దుర్వ విశ్వశ్వర్, ఆదివాసీ రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు కోవా వెంకట్ రావు ,మండడి నాగోరావ్ మరియు వివిధ గ్రామాల పటేల్ లు ప్రజలు పాల్గొన్నారు

# రాజీవ్ యువ వికాస్ పథకం ఎక్కడ? భీమ్ ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్ ప్రవీణ్

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 17(డి డి 9):-**




నేడు సోనాల మండల కేంద్రంలో భగత్ ప్రవీణ్ మాట్లాడుతూ .పథకం పేరుతో దరఖాస్తులు తీసుకోవడం తప్ప, యూనిట్లు మంజూరు చేయడం, బ్యాంక్ లోన్లు ఇవ్వడం, సబ్సిడీలు విడుదల చేయడం వంటి అసలు అమలు ప్రక్రియ ఎక్కడా కనిపించడం లేదు. గ్రామాల నుంచి పట్టణాల వరకు యువత పరిస్థితి ఒకటే అప్లై చేసాం... కానీ ఫలితం లేదు అంటున్నారు అని అన్నారు తక్షణమే ప్రభుత్వం స్పందించి, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అర్హులైన ప్రతి యువకుడికి యూనిట్లు మంజూరు చేసి, బ్యాంక్ లోన్లు మరియు సబ్సిడీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్ టెస్టుకు సీఎం సిద్ధం.. మరి కేటీఆర్ సిద్ధమా?

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు.

'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని





ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# నేను పార్టీ వీడతానని సంజయ్‌కు చెప్పానా?..

- **మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టాడు!**
- **తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే ఆఫర్ ఇచ్చారు**
- **సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారు**
- **నాకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు?**
- **నేను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా?**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు ఆఫర్ ఇచ్చాడని సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెప్పారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు?, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారని.. కాంగ్రెస్‌లో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారన్నారు. తనకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు? అని.. తాను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా? అని ప్రశ్నించారు. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా? అని.. తమ పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయే అని జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిన్న అసెంబ్లీ లాబీల్లో చేసిన వ్యాఖ్యలపై జీవన్ రెడ్డి స్పందించారు. 'జగిత్యాల ఎమ్మెల్యే తనతో కలిసి పనిచేయాలని నాకు ఆఫర్ ఇచ్చారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు.. నన్ను ఎలా కలిసిరమ్మంటున్నారు. స్పీకర్ ఏమో సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని అంటారు.. సంజయ్ ఏమో కాంగ్రెస్‌లో కలిసి పని చేయాలని అంటారు. సంజయ్ ఎవరు నాకు ఆఫర్ ఇవ్వడానికి?. నేను పార్టీ వీడతనాని ఆయనకు చెప్పానా?. వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు?. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా?. మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయ్. ఏ పార్టీనో ముందు నువ్వు తేల్చి చెప్పు సంజయ్. నువ్వు ఎవరు కలిసి పనిచేయాలని అంటావు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం ఎంత బాధగా ఉంటది?. ఎంత బాధ ఎంత ఇబ్బందిగా ఉంటే పార్టీ వీడాలనే నిర్ణయం తీసుకుంటామో అర్థం చెస్కోవాలి' అని జీవన్ రెడ్డి అన్నారు.

'నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం నాది. బలహీన వర్గాల మహిళకు కేటాయించిన చైర్మన్ సీట్ నుంచి అడబిడ్డను దించేశావు. సంజయ్ చదువుకున్న వాడు, చట్టం కూడా తెలుసు. జగిత్యాల అభివృద్ధి కోసం అని 20 నెలలుగా చెబుతున్నారు. యావర్ రోడ్డు విస్తరణ ఏమైంది సంజయ్. యావర్ రోడ్డు విస్తరణ అభివృద్ధిలో భాగం కాదా?. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌళిక సదుపాయాలు అభివృద్ధిలో లేవా?. నేను తీసుకునే ప్రతీ నిర్ణయం రాజ్యాంగ బద్ధంగా ఉంటుంది. రాజ్యాంగాన్ని పాటించని వ్యక్తి నాకు నీతులు చెప్తున్నాడు. నేను కాంగ్రెస్లోనే ఉండాలని అనుకుంటున్నా. కానీ ఉండే పరిస్థితులు తేకపోతే ఏమి చేస్తాం. ఇంట్లో వుడుము వస్తే ఇల్లు ఇడిచి పెడతాం.. అలాగే సంజయ్ ఉడుము లాగా వచ్చి కాంగ్రెస్లో చేరాడు. ప్రజలు ఎవరికి ఏ బాధ్యత ఇస్తే అది నిర్వర్తించాలి. ప్రజలు ఇచ్చిన బాధ్యత నిర్వర్తించకుండా ఉంటే వారు ఆ పదవికి అనర్హుడు' అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.



'నేను ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. కాంగ్రెస్‌ని వదిలిపెట్టడానికి సంజయ్ కారణం అవుతారు. సంజయ్‌ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లోని మిత్రులు ఈ విషయంలో మాట్లాడుతున్నారు. నాకు కార్యకర్తల అభిప్రాయాలు ముఖ్యం. కాంగ్రెస్ అధిష్టానంది కూడా బాధ్యతే. నేను పార్టీని వీడటంలో సంజయ్‌ది ఒక్కటే పాత్ర కాదు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం ఉంది.. అసంతృప్తి ప్రజల్లో ఉంది. నేను పార్టీని వీడితే పార్టీ అగుతుందా?, ఒక్కడు పోతే ఆగదు. కాంగ్రెస్లోకి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే పరిష్కారం. పార్టీ వారిని దూరం పెడుతుందా?. అలా అయితే కాంగ్రెస్లో సమస్యకు పరిష్కార మార్గం వచ్చినట్టే' అని జీవన్ రెడ్డి సూచించారు.



# సోనాల మండల నూతన తహసిల్దార్ గారికి సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 17(డి డి 9):-**

సోనాల మండలానికి ఇటీవల బదిలీపై వచ్చిన అంకుల్ల మల్లేష్ ఎమ్మార్వో గారికి కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్, సర్పంచులు ఆత్రం లక్ష్మణ్, మడావి రమాదేవి, పిఎస్ సి ఎస్ డైరెక్టర్ సోనాల లోలపు పోశెట్టి ,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు జుంగాల భోజన్న ,సీనియర్ నాయకులు రామాయి రాము ,బాసెట్టి సుదర్శన్ ,రాయి సీడం ఇస్రు, మేస్త్రం లాలూరామ్ ,మునేశ్వర్ సోమన్న, భీమ్రావు పాటిల్ ,మాజీ కో ఆప్షన్ మెంబర్ మహమూద్, బిపిఎం బాపూరావు ,జాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మొరం వాహనాలు సీజ్

- **రెండు టిప్పర్లు, ఒక జెసిబి పట్టివేత**

**కోటగిరి, మార్చి 17(డిడి9 వార్త):**

కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మొరం తవ్వకాలు చేసి తరలిస్తున్న వాహనాలపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. మండల పరిధిలోని ఎత్తొండ క్యాంపు సమీపంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తవ్వి తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక జెసిబి వాహనాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.

మంగళవారం ఎత్తొండ క్యాంపు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టలు, కొండల్లో మొరం తవ్వి తరలిస్తున్నట్లు గుర్తించారు.

దీంతో అక్కడ పనిచేస్తున్న ఒక జెసిబి యంత్రంతో పాటు రెండు టిప్పర్ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా




కోటగిరి ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టలు, కొండల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేసి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా జరిగే ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఏ మాత్రం సహించబోమని తెలిపారు. మండల పరిధిలో ఇలాంటి అక్రమ తవ్వకాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

అక్రమంగా మొరం తవ్వడం వల్ల ప్రకృతి సమతుల్యతకు భంగం కలగడమే కాకుండా భూసంరక్షణకు కూడా ముప్పు ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ తవ్వకాలు జరగకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో "ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు "కు స్పందన.

**బజార్హత్నూర్, మార్చి 17,(డిడి9వార్త ):-**



99 రోజులలో ప్రజాపాలన. ప్రగతి ప్రణాళికలో భాగంగా బజార్హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.ఉదయం పూటనే బజార్ హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్న ఈ శిబిరంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంకు మంచి స్పందన వచ్చింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైద్య చికిత్సచేయించుకోవడానికి రాగ వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తగినమాత్రలు, ఇంజక్షన్లు ఇచ్చారు. 312 మంది రోగులకు ఇక్కడే వైద్యం అందించి తగిన సూచనలు, మందులు, మాత్రలు ఇవ్వగా, 18 మంది రోగులకు ఆదిలాబాద్లో గల రాజీవ్ గాంధీ మెడికల్ సొసైటీ (రిమ్స్)కి వెళ్ళమని చెప్పటం జరిగిందని వైద్య అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ నుంచి వచ్చిన వైద్యులు డాక్టర్ తేజస్విని (పిల్లల వైద్య నిపుణురాలు), డాక్టర్ సౌజన్య (స్త్రీ వైద్య నిపుణురాలు), డాక్టర్ శ్రీజ (కంటి వైద్య నిపుణురాలు), డాక్టర్ వినీత్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ శరత్ రావు (ఎముకల వైద్య నిపుణులు) డాక్టర్ వినోద్ (దంత వైద్య నిపుణులు) రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజార్హత్నూర్ డాక్టర్లుభీమ్రావు, శిల్ప,అలేఖ్య లు వైద్యసిబ్బంది , ఆశాకార్యకర్తలు,నాయకులు,పలు గ్రామాల నుంచి వచ్చిన జనాలు తదితరులు పాల్గొన్నారు.





# విద్య భవిష్యత్తును మార్చగలదు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

- నాటు వైద్యాన్ని నమ్మకుండా, ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలి
- సిరికొండ మండలం కుండగూడ గ్రామంలోని పాలవాగు హామ్లెట్ లో ఉచిత వైద్య శిబిరం కార్యక్రమం.
- ప్రతి ఒక్కరూ గంజాయి నిర్మూలనపై జిల్లా పోలీసులకు సహకరించాలి.
- ఆదిలాబాద్ నుండి విచ్చేసిన నిష్ణాతులైన ప్రైవేటు వైద్య నిపుణులు
- అరైవ్ ఆలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి.
- వైద్య శిబిరం నందు పాల్గొన్న కుంటగూడ పాలవాగు గ్రామాల 100 ఆదివాసి గిరిజన ప్రజలు.
- జనరల్ ఫిజీషియన్, గ్యాస్ట్రో, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, డెంటల్ లలో ఉచిత వైద్య సేవలు.
- కంటి సమస్యలు ఉన్నవారికి ఆదిలాబాద్ నందు శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయిస్తానని హామీ.
- పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు అందజేత.





**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

మారుమూల ఆదివాసి గిరిజన గ్రామ ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరచాలని, వైద్య సదుపాయాలు మరింత చేరువ చేసే ఉద్దేశంతో మంగళవారం సిరికొండ మండలంలోని కుంట కూడా గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు హామ్లెట్ లో ఆదివాసీలకు ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరం నందు కుంట కూడా మరియు పాలవాకు గ్రామాల 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం, ఆదిలాబాద్ నుండి నిష్ణాతులైన ప్రముఖ ప్రైవేటు వైద్యుల సహాయంతో నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరం నందు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు విద్యకు మొదటి ప్రాధాన్యత కేటాయించాలని, నాటు వైద్యాన్ని నమ్మకుండా ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచించారు. రక్తహీనతకై ఇప్పపువ్వు లడ్డూలను తినాలని సూచించారు. అభివృద్ధిని కోరుకునేవారు సంఘవిద్రోహశక్తులకు దూరంగా ఉండాలని అలాంటి వారి సమాచారం వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకై జిల్లా పోలీసులు చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని, గంజాయి పండించడం, రవాణా చేయడం, సేవించడం, చట్టరీత్య నేరమని, గంజాయి అలవాటు పడిన వారికి డి అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్సను అందజేయడం జరుగుతుందని తెలిపారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వ పథకాలు రాకుండా ఉంటాయని తెలిపారు. యువత గ్రామాలను వదిలి ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలను సాధించి గ్రామాల పేరును, కీర్తి ప్రతిష్టలను పెంచేలా కష్టపడి చదవాలని సూచించారు. గ్రామంలో చదువుతున్నటువంటి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. వైద్య శిబిరం నందు చికిత్సను అందుకున్న బాధితులు ఎలాంటి అదనపు చికిత్స కై ఆదిలాబాద్ నందు ఉన్నత వైద్యానికి సిఫార్సు చేసినట్లయితే వారికి సరైన సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంచి ఆహారా అలవాట్లను అలవర్చుకోవాలని అన్నం తినడం తక్కువ చేసి, జొన్న లాంటి వాటిని తినడం అలవర్చుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా ఉండాలని ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు చేస్తున్న జిల్లా పోలీసుల కృషికి సహకరించాలని తెలిపారు. మొదటగా ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మరియు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టేలను గ్రామ ప్రజలు ఆదివాసి సాంప్రదాయాల డప్పు వైద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. తదుపరి కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా ఆదివాసీలు తమ సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ఆదివాసి ప్రజలు చదువుపై ప్రాధాన్యత కేటాయించాలని, ప్రజలు ఎలాంటి వైద్య సేవలకైనా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించాలి అన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించి గ్రామాల, ప్రజల అభివృద్ధికి సహాయపడాలని తెలిపారు. ఆదివాసిలు అన్ని రకాలుగా అభివృద్ధి చెంది, ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడా సిఐ సిహెచ్ రమేష్, సిరికొండ ఎస్సై ఎస్ పూజ, డాక్టర్లు డా ఆడే క్రాంతి కుమార్, జనరల్ ఫిజిషియన్, రజిత క్రాంతి కుమార్, గైనకాలజిస్ట్, డా ఆనంద్,డెంటల్, డా శృమిత్ జవ్వాజి, ఆర్థోపెడిక్, డా వివేక్, గ్యాస్ట్రిక్, డా మహేష్, ఆప్తమలజిస్ట్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు వైద్య బృంద సభ్యుడు శాంత రాజ్, గ్రామ సర్పంచ్ మీరా బాయి, సార్ మేడిలు, జిల్లా మేడి, తదితరులు పాల్గొన్నారు.







## వర్తమన్నూర్లో పశువైద్య శిబిరం ఏర్పాటు, ఉచిత గాలికుంటూ టీకాలు.

**బజార్హత్నూర్, మార్చి 17,(డిడి 9వార్త ):-**

బజార్ హత్నూర్ మండలంలోని వర్తమాన్నూర్ గ్రామం లో మంగళవారం రోజు పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచిత గాలి కుంటూనివారణ టీకాలను పశువులకు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సిడం ప్రభాకర్, ఉప సర్పంచ్ దేవర్ల శ్రీకాంత్ , పశువైద్య సిబ్బంది సి హెచ్ అరవింద్ ,ఠాకూర్ సూరజ్, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు నేరుగా ఖాతాల్లోనే జమ చేయాలి: ఐఎఫ్టీయూ డిమాండ్

**నిజామాబాద్ జిల్లా, 17 మార్చి(డీడీ9 వార్త):**

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రూపుల వారీగా వేతనాలు చెల్లించాలని తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, దీనివల్ల కార్మికుల మధ్య విభేదాలు రావడమే కాకుండా ఉపాధి భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకొని, గతంలో మాదిరిగానే వేతనాలను నేరుగా కార్మికుల ఖాతాల్లోనే వేయాలని ఆయన మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి : 17 ( డిడి9వార్త ప్రతినిధి )**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తలమడుగు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిత్ర ఎన్జీఓ సహకారంతో ఏర్పాటు చేసిన రూ. 2 లక్షల విలువైన నూతన వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య శిబిరాల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను అక్కడికక్కడే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే అవి భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులుగా మారే ప్రమాదం ఉందని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గర్భం దాల్చిన నాలుగు లేదా ఐదు నెలల సమయంలో తప్పనిసరిగా 'టిఫా' స్కాన్ చేయించడం ద్వారా శిశువుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. దీనివల్ల ప్రసవ సమయంలో తలెత్తే ఇబ్బందులను అరికట్టి తల్లీ బిడ్డల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ మరియు టీబీ బాధితులకు క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేయాలని, తద్వారా కిడ్నీ, లివర్ వైఫల్యాల వంటి తీవ్ర సమస్యలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం 12 గంటలు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ సేవలను భవిష్యత్తులో 24 గంటలకు విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నామని, ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించడం ద్వారా ఆసుపత్రికి అదనపు నిధులు, వసతులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రామచంద్ర రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజ్ మోహన్, డాక్టర్ హరీష్, శ్రీధర్, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.






## నేరడిగొండలో రైతులకు ఉచిత కూరగాయల కిట్ల పంపిణీ

- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వయంగా కూరగాయలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 17(డి డి 9):-**

నేరడిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మరియు రైతులకు పోషకాహార భద్రత కల్పించే లక్ష్యంతో ఉచిత కూరగాయల మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి బోథ్ బ్లాక్ ఆత్మ (ATMA) చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కూరగాయల కిట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా గొర్ల రాజు యాదవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వయంగా కూరగాయలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుటుంబం ఇంటి వద్దే తోటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని, ఖర్చులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రోల్ మమడ సర్పంచ్ తొడసం శంకర్, దర్బ తండా సర్పంచ్ ఆడే సీతారాం, ఆత్మ డైరెక్టర్లు కుంట శంకర్, అందు సింగ్, భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం, జాదవ్ కపిల్ దేవ్, వసంత్ రావు, సాబ్లె ప్రకాష్, వ్యవసాయ అధికారి కృష్ణవేణి (AO), ఉద్యాన శాఖ అధికారి భూమయ్య, AEOలు సౌజన్య, శ్యామ్ తదితరులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బీర్కూర్‌లో తాసిల్దార్ కార్యాలయానికి బీజేపీ నాయకుల వినతి పత్రం

**బీర్కూర్, మార్చి 17(డిడి9 వార్త):**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బీర్కూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో మంగళవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి ప్రకటించాలని, రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయడం, మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం అందించడం, కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ళ సాయికిరణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు హనుమాన్లు, బీజేపీ సీనియర్ నాయకులు బీరుగొండ, సాయిబాబా, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మేత్రీ సాయిలు, బీజేపీ నాయకులు పండరి, నాగేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయండి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, 17 మార్చి(డీడీ9 వార్త):**

అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు జి.సీతారాం, సిహెచ్. రమేష్ కోరారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పాన్ గల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మహాసభల వివరాలను వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో గల ఎన్.ఆర్ భవన్‌లో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పాలక పార్టీలు వ్యవసాయ కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఈ సభలో ఎండగడతామని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాట కర్తవ్యాలను ఈ మహాసభలో రూపొందించుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, సంఘ ప్రతినిధులు మరియు సభ్యులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మహాసభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బి. సాయిలు, వై. కృష్ణ, గంగాధర్, శంకర్, లక్ష్మణ్, సయ్యద్, సమీర్, నారాయణ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోవాలి పోతంగల్ ఏ ఓ నిషిత

**నిజామాబాద్ పోతంగల్ మార్చి 17 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని అర్హులైన రైతులందరూ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిషిత మంగళవారం రోజున ఒక ప్రకటన తెలిపారు ఎవరైతే కొత్తగా పొలం పట్ట చేయించుకున్నారో వారు రైతు భరోసా వచ్చుటకు దరఖాస్తు చేసుకోవాలి తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం యాసంగి 2025. 2026సంవత్సరం కింద కొత్త దరఖాస్తులు బ్యాంకు వివరాల అప్డేట్ కోసం అవకాశం కల్పించింది 28,02,2026నుండి వరకు కొత్త పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు ఇప్పటివరకు రైతు భరోసా పొందని అర్హులైన రైతులు లేదా బ్యాంక్ వివరాలు నమోదు చేయని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి (నమోదు కేంద్రం) రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ) వద్ద దరఖాస్తు చేసుకోగలరు చివరి తేదీ 25,03,2026 వరకు ఉంది కావున రైతులందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు



### పెళ్లై నెల రోజులు కూడా కాకముందే
# షాకిచ్చిన రష్మిక..

టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లో వీరి పెళ్లి ఘనంగా జరిగింది. అయితే పెళ్లి సందడి ముగిసి, హనీమూన్ నుంచి తిరిగి వచ్చారు. ఇక పెళ్లై నెల రోజులు కూడా గడవకముందే రష్మిక మళ్ళీ షూటింగ్స్‌లో బిజీ అయిపోవడం అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. తన ప్రొఫెషన్ పట్ల ఆమెకు ఉన్న అంకితభావం చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సాధారణంగా పెళ్లైన హీరోయిన్లు పెళ్లి తర్వాత కొన్నాళ్లపాటు విరామం కోరుకుంటారు. కానీ రష్మిక మందన్న మాత్రం అప్పడే షూటింగ్ సెట్స్‌లో ప్రత్యక్షమయ్యారు.

తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో 'వేట మొదలైంది' అనే క్యాప్షన్‌తో ఓ ఫోటోను షేర్ చేశారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'మైసా' చిత్రానికి సంబంధించిన కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌లో ఆమె పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. రిస్క్‌తో కూడిన ఫైట్ సీన్లలో కూడా రష్మిక వెనకాడకుండా నటిస్తుండటంతో చిత్ర యూనిట్ ఆమె డెడికేషన్‌ను మెచ్చుకుంటోంది. ఒకవైపు వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, మరోవైపు కెరీర్‌ను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా రష్మిక దూసుకుపోతున్నారు. నేషనల్ క్రష్ స్థాయి నుంచి గ్లోబల్ స్టార్‌గా ఎదిగే క్రమంలో ఆమె పడుతున్న శ్రమ చూసి అభిమానులు మురిసిపోతున్నారు.

పెళ్లి తర్వాత ఆమె స్పీడ్ చూస్తుంటే, త్వరలోనే మరిన్ని భారీ ప్రాజెక్టులతో రష్మిక మందన్న బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. 'మైసా' విషయానికొస్తే.. ఈ సినిమాను రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాన్ ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా గోండ్ జాతి నేపథ్యంలో సాగే ఎమోషనల్ అండ్ యాక్షన్ థ్రిల్లర్. ఇందులో రష్మిక ఒక తెగ మహిళగా కనిపించనుంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

### ఆయన నుంచి చాలా
# నేర్చుకున్నా..



పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న థియేటర్స్‌లోకి అడుగుపెట్టనుంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించారు. ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమా విశేషాలు పంచుకుంది రాశీ ఖన్నా. 'నిజం చెప్పాలంటే, పవన్ కల్యాణ్ గారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఎంతో ఉత్సాహంతో ఓకే చెప్పేశా. నేను నా మొదటి సినిమా చేస్తున్నప్పటి నుంచే ఆయనతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలి అనుకున్నాను. 'ఉస్తాద్ భగత్ సింగ్'తో నా కల నెరవేరింది. ఈ సినిమాలో నా పాత్ర చాలా మోడ్రన్‌గా ఉంటుంది. నా పాత్రకు మంచి క్యారెక్టరైజేషన్ ఉంటుంది. నాకు ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది.

నాకు డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి, ఆ సాంగ్ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. పవన్ చాలా సింపుల్ పర్సన్, ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలో ఒక తెలియని అమాయకత్వం ఉంది. తక్కువ మాట్లాడతారు.. కానీ, ప్రతి మాటలో విలువ ఉంటుంది. నాతో ప్రజా సేవ చేయమని చెప్పారు. పవన్ ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. ఆయన నుంచి మానవత్వం నేర్చుకున్నాను. ఉస్తాద్ వేడుకలో స్టేజ్ మీద నుంచి పవన్ అభిమానులను చూస్తుంటే, ఆయనను ఒక దేవుడిలా ఆరాధిస్తున్నట్లు అనిపించింది' అంటూ మరెన్నో విశేషాలు పంచుకుంది. ఇక ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం హిందీలో అక్షయ్ కుమార్‌తో ఒక సినిమా, 'ఫర్జీ 2' షో చేస్తున్నాను. అమెజాన్ సిరీస్‌లో ఒక పంజాబీ పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను, అందులో నా డైలాగ్స్ అన్నీ పంజాబీలోనే ఉంటాయి. తమిళ్ లో 'రౌడీ అండ్ కో' చేస్తున్నాను. తెలుగులో కూడా కొన్ని కథలు వింటున్నానని తెలిపారు.



# పవన్ కళ్యాణ్ పక్కన నటించడంపై శ్రీలీల ఆసక్తికర కామెంట్స్..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకగా, తాజాగా.. ప్రమోషన్లలో భాగంగా హీరోయిన్ శ్రీలీల చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. షూటింగ్ అనుభవాల గురించి ఆమె చెప్పిన విషయాలు పవన్ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాయి.సాధారణంగా ఏ సినిమాకైనా నటీనటులకు ముందుగానే స్క్రిప్ట్ పేపర్లు ఇస్తారు. కానీ 'ఉస్తాద్ భగత్ సింగ్' సెట్స్‌లో మాత్రం సీన్ వేరేలా ఉండేదట. "షూటింగ్ మొత్తంలో నాకు ఎప్పడూ ముందుగా స్క్రిప్ట్ కానీ, డైలాగ్ పేపర్ కానీ ఇచ్చేవారు కాదు. అంతా ఆన్ ది స్పాట్ జరిగిపోయేది" అని శ్రీలీల బాంబు పేల్చింది.

హరీష్ శంకర్ మార్కు టేకింగ్‌కు, పవన్ కళ్యాణ్ ఎనర్జీకి తగ్గట్టుగా అప్పటికప్పుడు డైలాగ్స్ రావడం, వాటిని శ్రీలీల కూడా అంతే ఈజీగా పలకడం విశేషం. పవన్ కళ్యాణ్‌తో కలిసి నటించడంపై శ్రీలీల ఎమోషనల్ అయ్యారు. "పవన్ కళ్యాణ్ గారి వంటి వారితో స్క్రీన్‌ను పంచుకోవడం ప్రతి నటి కల. నాకైతే ఇది కేవలం ఒక సినిమా కాదు, నా కెరీర్‌లో ఒక గర్వించదగ్గ, మరువలేని మైలురాయి" అని పేర్కొన్నారు.

ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కాబోతున్న ఈ చిత్రంలో రాశీ ఖన్నా మరో హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్, థమన్ అదిరిపోయే సంగీతాన్ని అందించారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'ఉస్తాద్' రికార్డులు తిరగరాస్తున్నాడు. మరి వెండితెరపై పవన్ కళ్యాణ్ వింటేజ్ మాస్ అవతార్ ఎలా ఉంటుందో చూడాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే!

# నాకు నయనతార కావాలి.. నా కల నెరవేరుస్తారా..?

తమిళనాడులో రాజకీయ వర్గాల్లో ఒక వ్యాఖ్య పెద్ద దుమారాన్ని రేపింది. అన్నాడీఎంకే ఎంపీ షణ్ముగన్ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ నటి నయనతార పేరును ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తమిళనాడులో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ All India Anna Dravida Munnetra Kazhagam (అన్నాడీఎంకే) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. విల్లుపురంలో జరిగిన ఈ నిరసనకు అన్నా డీఎంకే నేత, ఎంపీ సీవీ షణ్ముగన్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో లైంగిక వేధింపుల ఘటనలు పెరుగుతున్నాయని ఆరోపించారు. వాటిని అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి వ్యసనం కారణంగా హత్యలు, దోపిడీలు, ఇతర నేరాలు పెరుగుతున్నాయని కూడా ఆరోపించారు.

అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించిన "మీ కలలు చెప్పండి, మేము నెరవేర్చుతాం" అనే కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "మీ కలలు చెప్పండి, నేను నెరవేర్చుతాను అని సీఎం అంటున్నారు. అయితే నాకు నయనతార కావాలి... నా కలను నెరవేరుస్తారా?" అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో అక్కడ ఉన్నవారిలో చర్చ మొదలైంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా మాట్లాడారని పలువురు మండిపడ్డారు. వివాదం పెరగడంతో అనంతరం షణ్ముగం వివరణ ఇచ్చారు. ప్రసంగ సమయంలో పొరపాటున ఒక నటి పేరు ప్రస్తావించానని, ఎలాంటి అవమానకర ఉద్దేశం లేదని చెప్పారు. జరిగిన ఘటనకు తాను మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని తెలిపారు. మొత్తంగా ఈ ఘటనతో తమిళనాడు రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధానికి తెరలేపింది.. మొన్నటి మొన్న ఓ బీజేపీ నేత.. నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపగా.. ఇప్పుడు.. అన్నాడీఎంకే ఎంపీ వ్యాఖ్యలపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు..

మరోవైపు, నయనతారపై అన్నాడీఎంకే ఎంపీ అనుచిత వ్యాఖ్యలను ఖండించింది నడిగర సంఘం.. సినీ తారలపై అనుచిత వ్యాఖ్యలను మేం ఒప్పుకోం అని స్పష్టం చేసింది.. బాధ్యతగల పదవుల్లో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు సరికావు అని హితవు చెప్పింది.. బేషరతుగా నయనతారకు క్షమాపణ చెప్పాలని అని నడిగరసంఘం డిమాండ్ చేసింది..



# చిరంజీవితో ఆ తరహా సినిమా కచ్చితంగా తీస్తా



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు."ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను" అని హరీశ్ చెప్పారు."పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు" అని ప్రశంసించారు.